సాక్షి ప్రకాశం

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



రేషన్ మాఫియా @ దర్శి

దర్శి కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అధికారుల అండతో నిత్యం లారీల ద్వారా బోర్డులు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. - 8లో..



'కొరియర్‌లో డ్రగ్స్' ఫోన్లకు భయపడొద్దు

మీ పేరుతో పంపిన కొరియర్‌లో డ్రగ్స్, తుపాకులు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ నుంచంటూ వచ్చే ఫోన్లకు భయపడి వారికి డబ్బులు పంపొద్దని ఎస్పీ సూచించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31.3/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వడ్డీల భారం తగ్గించండి

- డ్వాక్రా గ్రూపుల నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తున్న బ్యాంకులు
- కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టిన ఐద్వా



కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టిన డ్వాక్రా మహిళలు

ఒంగోలు టౌన్: డ్వాక్రా గ్రూపు మహిళల నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తున్న బ్యాంకులపై చర్యలు తీసుకోవాలని, అధిక వడ్డీలు వసూలు చేయకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని గాంధీనగర్‌కు చెందిన డ్వాక్రా గ్రూపు మహిళల నుంచి యూనియన్ బ్యాంకు అధికారులు గత సంవత్సర కాలం నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గ్రూపు సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే బ్యాంకు చార్జీల పేరుతో వారి అకౌంటులోని డబ్బులను బదిలీ చేసుకుంటున్నారని తెలిపారు. ఈ తప్పుడు పద్ధతిని నిలిపి వేయాలని స్థానిక అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని, అనివార్యంగా ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు నిరసన చేపట్టినట్లు వివరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం సమర్పించగా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని మెప్మా పీడీ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రజలకు చేరువయ్యేలా ఆరోగ్య కార్యక్రమాలు



సమీక్ష సమావేశంలో డీఎంహెచ్‌ఓ డా.సురేష్ కుమార్, కేంద్ర బృందం

ఒంగోలు టౌన్: వైద్య ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలన్నింటినీ ప్రజలకు చేరువయ్యేలా కృషి చేయాలని ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ పరిశీలకుడు డాక్టర్ వరుణ్ విజయ్ గైకి సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ సేవలను, జనని శిశు సురక్ష లబ్ధిదారులను, ఐదేళ్లలోపు చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, పట్టణ, ప్రాథమిక ఆస్పత్రులు, ఆరోగ్య ఉప కేంద్రాలను సందర్శిస్తారని తెలిపారు. సమావేశంలో ఇమ్యూనైజేషన్ అధికారి డా.పద్మజ, డీపీఎంఓ డా. వాణిశ్రీ, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పాలేరులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్

పాలేరులో పచ్చతోడేళ్లు

అడ్డొస్తే..అంతుచూస్తాం..

పాలారు నదిని పచ్చతోడేళ్లు కుళ్ల బొడిచేస్తున్నాయి. అడుగడుగునా బావుల్లాంటి భారీ గోతులు పెట్టి ఇసుక తోడేస్తున్నాయి. 'ఇక్కడ మామాటే శాసనం.. అడ్డొస్తే కేసులు బనాయిస్తాం, గంజాయి కేసులు పెట్టి ఇరికిస్తాం' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండతో పాలారు నదిని గుల్ల చేస్తున్నాయి. రాత్రిళ్లు ఇష్టారాజ్యంగా ఇసుకను అక్రమంగా తరలిస్తూ రూ.కోట్లు కొల్లగొట్టేస్తున్నాయి. ప్రభుత్వాదాయానికి భారీ ఎత్తున గండిపడుతోంది. జరుగుమల్లి, పొన్నలూరు మండలాలకు చెందిన పచ్చమంద సాగిస్తున్న దందాపై పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే ఇసుక మాఫియా
- ప్రతిరోజూ 100 నుంచి 150 టిప్పర్ల ద్వారా ఇసుక తరలింపు
- ఇదేంటని ప్రశ్నించిన వారిపై గంజాయి కేసులు
- పోలీసులతో బెదిరింపులు
- ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో నష్టం
- గుంతలమయంగా మారిన నది
- ధ్వంసమవుతున్న రహదారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో కొండపి నియోజకవర్గంలో ఇసుక దందాకు అంతేలేకుండా పోతోంది. అధికారాన్ని అడ్డంపెట్టుకుని తెలుగుదేశం పార్టీ నాయకులు చెలరేగిపోతున్నారు. పాలేరు నదిని తవ్వేసి అడ్డగోలుగా ఇసుక తరలించేస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిని పోలీసులతో వేధింపులకు గురిచేస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన ఇద్దరు కీలక ప్రజాప్రతినిధుల అండదండలతోనే జరుగుమల్లి, పొన్నలూరు మండలాల నేతలు అక్రమంగా ఇసుక తరలించేస్తూ జేబులు నింపుకుంటున్నారు. జరుగుమల్లి మండలం కామేపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పాలేరు నదిలో 15 రోజులుగా దందా కొనసాగిస్తున్నారు. ప్రతి రోజు రాత్రి 8 నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు ఈ అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. రోజూ సుమారు 100 నుంచి 150 టిప్పర్ల వరకు ఇసుక తరలించేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక పగలు ట్రాక్టర్ల ద్వారా తోలుతున్నారు. కామేపల్లి నుంచి ప్రతి రోజు పొదిలి, చీమకుర్తి, సంతనూతలపాడు, టంగుటూరు, ఒంగోలు, సింగరాయకొండ ప్రాంతాలకు ఈ ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. దీంతో రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయని, ఈ ప్రాంతంలో రవాణా ఇబ్బందికరంగా ఉందని వాహనదారులు విమర్శిస్తున్నారు. పచ్చత మ్ముళ్ల తీరుతో నదిలో సుమారు 25 నుంచి 30 అడుగుల గోతులు పడ్డాయి.

ఉచిత ఇసుక కలే..

ప్రభుత్వ పెద్దలు మాత్రం ఇసుకపై క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలకు విరుద్ధంగా ప్రకటనలు చేస్తుంటారు. ఇసుక అందరికీ ఉచితం అంటూ చేస్తున్న ప్రకటనలు అన్నీ కలగానే మిగులుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇసుక కావాలంటే తెలుగుదేశం నేతల అనుమతి ఉండాలని, ముడుపులు చెల్లించిన వారికే ఇసుక సరఫరా చేస్తారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

■ కామేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి సొంత ఇంటిని నిర్మించుకునేందుకు ట్రాక్టరుతో పాలేరులోకి వెళ్లి ఉచితంగా ఇసుక తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో టీడీపీ నేతలు అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జరుగుమల్లి పోలీసు అధికారి వచ్చి ట్రాక్టరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని రావాలని ఆదేశించారు. సదరు వ్యక్తి ఏ మాత్రం బెదరకుండా ''ట్రాక్టరును స్టేషన్‌కు తీసుకుని రానని.. నేను తేవాలంటే మిగిలిన టిప్పర్లను, ట్రాక్టర్లను కూడా మీరు స్టేషన్‌కు తీసుకురావాలి'' అని అడ్డం తిరిగాడు. అవసరమైతే ట్రాక్టరును ఇక్కడే తగలబెడతానని హెచ్చరికలు చేయడంతో చేసేది లేక సదరు పోలీసు అధికారి వెనుదిరగాల్సి వచ్చింది.



గుంతలమయంగా మారిన కామేపల్లిలోని పోలేరమ్మ గుడి సమీపంలో రోడ్డు..

నష్టపోతున్న పొగాకు రైతు

ఇసుక టిప్పర్లు అడ్డగోలుగా తిరుగుతుండటంతో రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. దీంతో టిప్పర్ల యజమానులు చీమకుర్తి నుంచి గ్రానైట్ డస్ట్ తీసుకుని వచ్చి మరీ గుంతలు పూడుస్తున్నారని, దీంతో పొలాల కన్నా రోడ్డు ఎత్తుగా అయిందన్నారు. ఫలితంగా ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొగనారుమళ్లలో నీరు నిలిచిపోయింది. సుమారు 11 ఎకరాల్లో ఒక్కో ఎకరాకు 2 లక్షల చొప్పున మొత్తం రూ.22 లక్షలు వరకు వెచ్చించి వేసిన పొగనారుమళ్లు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు.



ఇసుక తవ్వకాల కోసం తెచ్చిన జేసీబీ

పెద్దల అండతోనే..

అధికార తెలుగుదేశం పార్టీ ముఖ్యుల అండదండలతోనే ఇసుక దందాకు పాల్పడుతున్నారు. నియోజకవర్గానికి చెందిన ఇద్దరు కీలక ప్రజాప్రతినిధుల సహకారంతోనే వీరు చెలరేగిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో అధికారులు సైతం వీరిపై కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. ఎవరైనా వీరి అక్రమ దందాను ప్రశ్నిస్తే ''చట్టవిరుద్ధంగా పేకాట ఆడుతున్నారు. గంజాయి తాగుతున్నారు'' అంటూ మాకు ఫిర్యాదులు వస్తున్నాయని ఏకంగా పోలీసు అధికారులతో ఫోన్‌లు చేయించి మరీ బెదిరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇసుక దందా ద్వారా సుమారు రోజుకు రూ.20 లక్షలు వెనకేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

■ ఇసుక దందాను నియోజకవర్గ పెద్దలు ఒక వర్గానికి కేటాయించారు. సుమారు 10 రోజుల కిందట టీడీపీ సానుభూతిపరుడు కామేపల్లి సర్పంచ్ ఎదురుతిరిగాడు. నా పంచాయతీలో మీ పెత్తనం ఏంటని తన అనుచరులను, జేసీబీలను పంపి టిప్పర్లకు ఇసుక నింపే ప్రయత్నం చేశాడు. దీంతో రెండు వర్గాల మధ్య వాదులాట జరిగింది. ఆ తరువాత వీరి మధ్య అంతర్గత ఒప్పందం జరిగిందన్న ప్రచారం సాగుతోంది. అప్పటి నుంచి సర్పంచ్‌కు చెందిన జేసీబీ పొలాల్లోనే ఉందని స్థానికులు తెలిపారు.



సర్పంచ్ అనుచరులు వదిలేసి వెళ్లిన జేసీబీ

జంగిల్ సఫారీలో పెద్దపులి కనువిందు

- గుజరాత్ పర్యాటకులకు సరికొత్త అనుభూతి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ఉన్న తుమ్మలబైలు సమీపంలో ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీలో ఓ పెద్దపులి స్వేచ్ఛగా సంచరిస్తూ పర్యాటకులకు కనువిందు చేసింది. ఈ సంఘటన శనివారం జరగగా సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పెద్దపులి సంచార సమయంలో జంగిల్ సఫారీ పర్యటనలో ఉన్న గుజరాత్ వాసులు తమ సెల్‌ఫోన్లలో పెద్దపులిని చిత్రీకరిస్తూ సరికొత్త అనుభూతికి లోనయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం ఎకో టూరిజం పరిధిలో ఉన్న జంగిల్ సఫారీలో పర్యటించేందుకు గుజరాత్‌కు చెందిన పర్యాటకులు చేరుకున్నారు. ఈ క్రమంలోనే ఓ జీప్సీలో కొంత దూరం వెళ్లిన గుజరాత్ వాసులకు పచ్చిక బయళ్లలో స్వేచ్ఛగా సంచరిస్తున్న పెద్దపులి కనిపించింది. తొలుత కొంత భయపడినా తేరుకున్న వారు తమ సెల్ ఫోన్లతో పెద్దపులిని చిత్రీకరిస్తూ ఎంతో ఉద్విగ్నానికి లోనయ్యారు. జంగిల్ సఫారీ పర్యటన ముగించుకున్న అనంతరం అక్కడి సిబ్బందితో ముచ్చటించారు. తాము గతంలో కొన్ని జంగిల్ సఫారీలలో పర్యటించామని, అయితే ఇంత ప్రశాంత వాతావరణంలో పెద్దపులి కనువిందు చేయటం తమ జీవితంలో మొదటిసారని వారు తెలిపినట్లు జంగిల్ సఫారీ మేనేజర్ శివ తెలిపారు. జంగిల్ సఫారీలో భాగంగా నల్లమలలో జీప్సీలలో పర్యటిస్తున్న సందర్శకులకు తరచూ పెద్దపులులు కనువిందు చేస్తుంటాయని అన్నారు. ఈ విషయాన్ని పర్యాటకులు తమ వద్దనున్న విజిటర్ బుక్‌లో నమోదు చేస్తుంటారని తెలిపారు. పెద్దపులి కనిపించిందన్న సంఘటనకు సంబంధించి ఫారెస్ట్ రేంజి అధికారి జీవన్ కుమార్ కథనం మేరకు జంగిల్ సఫారీలోని పులిచెరువు చెరువు ప్రాంతంలో ఎక్కువ సార్లు స్వేచ్ఛగా సంచరిస్తున్న పెద్దపులితో పాటు, కృష్ణ జింకలు, దుప్పులు, నెమళ్లు పర్యాటకులకు తారస పడుతుంటాయని తెలిపారు.



జంగిల్ సఫారీలో పర్యాటకులకు కనిపించిన పెద్దపులి

చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- మీకోసం గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో సహేతుకంగా పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో సోమవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి మీకోసం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సమస్యలను మొక్కుబడిగా పరిష్కరించకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. ఒకవేళ పరిష్కరించలేని సమస్యలు ఉంటే అర్జీదారులను పిలిచి వివరించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుండా పరిష్కరించినట్లు రికార్డుల్లో చూపితే సహించేది లేదని హెచ్చరించారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు మాధురి, ఝాన్సీ లక్ష్మి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

■ స్థానిక ఇందుర్తి నగర్‌కు చెందిన ఎస్తేరురాణి గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తనకు పింఛన్, రేషన్ కార్డు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. తన భర్త మరణించాడని కుటుంబ పోషణ కష్టంగా ఉందని తనకు ఉన్న రేషన్ కార్డును సైతం నిలిపేశారని, వితంతు పింఛన్‌కు అర్హత ఉందని తెలిపారు. పరిశీలించి త్వరగా న్యాయం చేయాలని కోరారు.



అర్జీ ఇచ్చేందుకు వచ్చిన నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయులు

■ అమ్మనబ్రోలుకు చెందిన షేక్ రబీనా గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తనకు హౌసింగ్ బిల్లులు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. తమకు ప్రభుత్వం మంజూరు ఇంటి నిర్మాణం కోసం బిల్లులు రాలేదని కేవలం ఒకే ఒక బిల్లు మాత్రమే వచ్చిందని మిగిలిన మొత్తాన్ని కూడా ఇప్పించాలని కోరారు.

■ జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన ఇట్టా రమణమ్మ గ్రీవెన్స్ అధికారులను కలిసి తన భర్త మరణానికి సంబంధించిన ఇన్సూరెన్స్ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. తన భర్త భవన నిర్మాణ కార్మికుడని, ఆయన మరణానంతరం కార్మికునికి ఇచ్చే డబ్బు అందలేదని అదేవిధంగా ఇన్సూరెన్స్ రాలేదని పరిశీలించి ఇప్పించాలని కోరారు.

■ జిల్లా వ్యాయామ పోరాట సమితి అధ్యక్షుడు సుదర్శి సిసింద్రీ ఆధ్వర్యంలో నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి జిల్లాలో ఖాళీగా ఉన్న 167 వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. జిల్లా విద్యా శాఖ పనితీరు లోపంతో మెగా డీఎస్సీలో నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయులకు శాపంగా మారిందని, జిల్లాలో మొత్తం 167 వ్యాయామ పోస్టులకు 74 ఖాళీలను మాత్రమే జిల్లా విద్యాశాఖ చూపిందని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

- పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో మంత్రి స్వామి, జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఏ.భారతి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసులను ఎప్పటికీ మరచిపోలేమని, వారి త్యాగాలను వెలకట్టలేనివని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయ స్వామి అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద మంత్రి స్వామి, జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ ఏ.భారతి, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్, 3వ అదనపు జడ్జి డి.రాములు, 7వ జడ్జి రాజా వెంకటాద్రి, 8వ అదనపు జడ్జి డి.అమన్ రాజా, డీఎల్ఎస్ఏ జడ్జి శ్యామ్ బాబు, నగర మేయర్ గంగాడ సుజాత నివాళులర్పించారు. పరేడ్ మైదానంలో పోలీస్ పరేడ్ నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వ్యక్తిగత జీవితం కంటే దేశ రక్షణ, ప్రజల రక్షణ కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న పోలీసు కుటుంబ సభ్యులకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని చెప్పారు. అమరులైన పోలీసు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని ఇటీవల భారత ప్రభుత్వం నేషనల్ పోలీసు డేగా ప్రకటించిందని తెలిపారు. గతంలో జిల్లాకు చెందిన పోలీసులు వివిధ ఘటనల్లో అమరులయ్యారని, వారి స్ఫూర్తిని కొనసాగించేలా కృషి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన ఎస్ నెమలిరెడ్డి సతీమణి రాధ, జి.శివ ప్రసాద్ సతీమణి స్వర్ణ కుమారి, షేక్ అబ్దుల్ రహీమ్ సతీమణి షాహినా, ఎస్.రవి సతీమణి మల్లేశ్వరిలకు లక్ష రూపాయల చొప్పున కార్పస్ ఫండ్‌ను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ కుమార్, ఉప రవాణా శాఖ కమిషనర్ ఆర్.సుశీల, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డాక్టర్లు, సీఐలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద మంత్రి, కలెక్టర్, జిల్లా జడ్జి, ఎస్పీ, ఇతర అధికారులు



పోలీసు అమర వీరుల కుటుంబ సభ్యులతో సమావేశమైన ఎస్పీ

పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో భాగంగా అసాంఘిక శక్తుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం జిల్లా పోలీసు శాఖ ఎప్పుడూ కృషి చేస్తుందని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అమరవీరుల కుటుంబాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత కుటుంబ స్థితి, పిల్లల చదువులు, ప్రభుత్వపరంగా వారికి రావాల్సిన ప్రయోజనాల గురించి వాకబు చేశారు. పోలీసు అమరవీరుల పిల్లలు మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డీపీఓ ఏఓ రామ్మోహన్, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఆర్‌ఐలు రమేష్ కృష్ణన్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు ఎప్పుడిస్తారు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్

ఒంగోలు టౌన్: తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తామని, ఫీజులను కాలేజీ యాజమాన్యాల ఖాతాల్లోనే జమచేస్తామని చెప్పి పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ అన్నారు. స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని ఎప్పుడు అమలు చేస్తారో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పాలన్నారు. జిల్లా వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర కోర్సులు చదువుతున్న 47,423 మంది విద్యార్థులకు 2023–24 సంవత్సరానికి సంబంధించి ఒక త్రైమాసికం ఫీజులు మాత్రమే విడుదల చేశారని వివరించారు. మిగిలిన విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజులు నేటికీ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది వరకు రూ.110 కోట్ల వరకు ఫీజులు బకాయి ఉన్నాయని, 2024–25 విద్యా సంవత్సరానికి కూడా కలుపుకుంటే రూ.218 కోట్ల వరకు నిధులు విడుదల చేయాల్సి ఉందని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యాదీవెన పేరుతో మొత్తం నాలుగు విడతలుగా ఫీజులు చెల్లించాలని నిర్ణయించిందని, అందుకు సంబంధించిన ఫీజు నగదును తల్లిదండ్రుల పేరు మీద జమ చేసి వారు కాలేజీలకు ఫీజు చెల్లించేలా చేసిందని తెలిపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 4 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. రీయింబర్స్‌మెంట్ తల్లుల ఖాతాలో వేస్తారా, లేక కాలేజీ యాజమాన్యాలకు చెల్లిస్తారా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి బండి వీరస్వామి, నగర కమిటీ సభ్యులు విజయ్, దేవ, కార్తీక్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్

మహిళా వైద్యురాలిని దూషించడం సిగ్గుచేటు



డీఎంహెచ్‌ఓ డా.సురేష్ కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న జిల్లా ప్రాథమిక వైద్యుల సంఘ నాయకులు

- ఎంపీటీసీపై కలెక్టర్, డీఎంహెచ్‌ఓలకు జిల్లా ప్రాథమిక వైద్యుల సంఘం నాయకుల ఫిర్యాదు

ఒంగోలు టౌన్: కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ ఎం.వైష్ణవిని ఎంపీటీసీ రామలింగం వెంకటరావు దూషించడం సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డా.రాహుల్, ప్రధాన కార్యదర్శి డా.ఖాదర్ మస్తాన్ బీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన కొత్తపట్నం మండల సర్వసభ్య సమావేశంలో మహిళ అనే కనీస గౌరవం లేకుండా సంస్కారహీనంగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.సురేష్ కుమార్‌లకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు మహిళా వైద్యుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తాయని చెప్పారు. అహంకారంతో దూషణలకు దిగిన ఎంపీటీసీని ఉపేక్షించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని జిల్లా మలేరియా ఇన్‌చార్జి అధికారి డా.శ్రావణ్ కుమార్, ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా.హేమంత్ కోరారు. ఇదిలా ఉండగా ఎంపీటీసీ దూషణలపై చేసిన ఫిర్యాదుకు వెంటనే స్పందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియమించినట్లు వైద్యుల సంఘం నాయకులు తెలిపారు.

రేషన్ మాఫియా @ దర్శి

- దర్శి కేంద్రంగా భారీగా రేషన్ బియ్యం దందా
- నిత్యం పదుల సంఖ్యలో లారీల్లో అక్రమ రవాణా
- ఇతర ప్రాంతాల నుంచి దర్శిలోని ఓ మిల్లుకు దిగుమతి
- ఆ మిల్లు నుంచి లారీల ద్వారా పోర్టులు, ఇతర ప్రాంతాలకు ఎగుమతి
- అక్రమార్కులు రెచ్చిపోతున్నా.. పట్టించుకోని స్థానిక అధికారులు
- జిల్లా స్థాయి రెవెన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, పోలీస్ అధికారులకు ఫోన్ చేసినా స్పందన కరువు
- మామూళ్ల మత్తు వలనే పట్టించుకోవడం లేదని ఆరోపణలు


కొత్త బస్తాలలో నింపి ఎగుమతికి సిద్ధం చేసిన రేషన్ బియ్యం


మిల్లు వద్దకు వచ్చిన రేషన్ బియ్యం లారీ నుంచి బస్తాలను దించుతున్న కూలీలు

దర్శి:

దర్శి పట్టణం కేంద్రంగా రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. ఏకంగా అధికారుల అండదండలతోనే రేషన్ బియ్యం అక్రమ రవాణా దందా సాగిస్తూ పేట్రేగిపోతోంది. అక్రమార్కులు అడ్డగోలుగా నిత్యం రేషన్ బియ్యం తరలిస్తున్నప్పటికీ.. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. స్థానిక అధికారులు స్పందించడం లేదని జిల్లా అధికారులకు ఫోన్‌లు చేసినా స్పందన కరువైందంటే.. రేషన్ దందా ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

దర్శిలోని ఓ మిల్లుకు రాత్రివేళ రేషన్ బియ్యం...

దర్శి నియోజవర్గంలోని ఐదు మండలాలతో పాటు చుట్టుపక్కల మరికొన్ని మండలాల నుంచి దర్శి పట్టణంలోని ఓ మిల్లుకు రాత్రివేళ రేషన్ బియ్యం తరలిస్తున్నారు. మిల్లులోని ఓ గదిలో రేషన్ బియ్యాన్ని కుప్పగా పోసి అక్కడ వేరే బ్యాగుల్లోకి మార్చి నెల్లూరు, కాకినాడ పోర్టులకు తరలిస్తున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని బీపీటీ వంటి ఖరీదైన బియ్యంలో కలిపి కల్తీ చేస్తున్నారు. పందికొక్కుల్లా బియ్యం నగదు బొక్కేస్తున్నారు. ఇలా దర్శి నుంచి ప్రతిరోజూ పదుల సంఖ్యలో లారీల్లో అక్రమంగా రేషన్ బియ్యం తరలివెళ్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. నియోజకవర్గ టీడీపీ నేత కనుసన్నల్లో పనిచేస్తున్న అధికారులు.. టీడీపీ నేతల అక్రమాలకు అండగా నిలుస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేషన్ బియ్యం కొనుగోలు దందా ఇలా...

ప్రస్తుతం రేషన్ షాపుల ద్వారా ప్రజలకు ప్రభుత్వం నాసిరకం బియ్యం అందిస్తోంది. కొందరు పేదలు ఆ బియ్యం తినలేక సంబంధిత డీలర్‌కే వదిలేస్తూ కిలోకు రూ.10 చొప్పున తీసుకుంటున్నారు. మరికొందరు పేదలు బియ్యం కావాలంటున్నా కూడా డీలర్లు ఇవ్వకుండా బలవంతంగా డబ్బులిచ్చి వేలిముద్రలు వేయించుకుంటున్నారు. బియ్యం బాగలేవని, స్టాకు లేదని కుంటిసాకులు చెబుతున్నారు. ఆ విధంగా పేదల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని డీలర్లు స్టాక్ పెట్టుకుని ఒకేరోజు మినీ లారీల ద్వారా తరలిస్తున్నారు. ఈ తరలింపు కార్యక్రమానికి మండలానికి ముగ్గురు చొప్పున దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మొత్తం 15 మంది టీడీపీ నేతలు నాయకత్వం వహిస్తున్నారు. మధ్యవర్తులకు కొంత కమీషన్ ఇచ్చి డీలర్ల వద్ద నుంచి కేజీ బియ్యాన్ని రూ.16కు కొనుగోలు చేస్తున్నారు. ఆ బియ్యాన్ని మిల్లుకు తీసుకెళ్లి బస్తాలు మార్చి నేరుగా పోర్టులకు తరలిస్తున్నారు. ఈ తతంగమంతా దర్శి కేంద్రంగా ఉన్న ఓ మిల్లులో విచ్చలవిడిగా జరుగుతోంది. కేజీ రూ.16కు కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని మరో రూ.10 అదనంగా కలిపి అమ్మకాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా పోలీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులైతే ఎక్కడ ఎవరు ఫిర్యాదు చేస్తారో అని ఫోన్‌లు కూడా ఎత్తే పరిస్థితి లేదు. విజిలెన్స్ అధికారులు మామూళ్ల మత్తులో పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఇక్కడి నుంచి గింజ కూడా బయటకు వెళ్లకూడదని...

బయట ప్రాంతాల్లో రేషన్ బియ్యం రేటు కేజీ రూ.18 నుంచి రూ.22 వరకు ఉంది. ఇక్కడ మాత్రం డీలర్లకు కేజీకి రూ.16 మాత్రమే ఇస్తున్నారు. దీంతో డీలర్లు అధిక రేటుకు బయట ప్రాంతాల వారికి బియ్యం అమ్మకుండా టీడీపీ నాయకులను నియమించుకుని బెదిరిస్తున్నారు. తాము చెప్పిన వారికే రేషన్ బియ్యం ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నారు. నియోజకవర్గంలోని దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు, దొనకొండ మండలాల్లో డీలర్లకు వచ్చే రేషన్ బియ్యం మొత్తం తమకే ఇవ్వాలని మండలాల్లో నియమించిన మధ్యవర్తులు తమ కమీషన్ కోసం డీలర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. చేసేది లేక డీలర్లంతా వాహనాలలో రేషన్ బియ్యాన్ని ఎత్తి అర్ధరాత్రి వేళ దర్శి పట్టణంలోని మిల్లుకు తరలిస్తున్నారు.


మిల్లులోని ఓ గదిలో కుప్పగా పోసి నిల్వ ఉంచిన రేషన్ బియ్యం వద్దకు మరో బస్తా తీసుకెళ్తున్న కూలీ


మిల్లు వద్ద ఉన్న రేషన్ బియ్యం లారీ

నయీం టైప్ నయా దందా...

హైదరాబాద్ నయీం టైప్‌లో టీడీపీ నాయకులు దర్శిలో నయా దందాకు తెరలేపారు. నియోజకవర్గానికి సంబంధం లేని రేషన్ లారీలు ఇటువైపు వస్తే వాటిని టీడీపీ నాయకులే పట్టుకుని పెట్రోలు బంకుల్లో పెట్టించి బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఈ తరహాలో కురిచేడులో ఓ రేషన్ లారీని టీడీపీ నేతలు వెంబడించి పట్టుకున్నారు. ఆ లారీని పోలీస్‌స్టేషన్‌కు అప్పజెప్పకుండా ఓ పెట్రోల్ బంకులో పెట్టారు. తమ మండలం నుంచి రేషన్ బియ్యాన్ని బయటకు తరలించాలని చూస్తే లారీలను బలవంతంగా స్వాధీనం చేసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ విషయం ఆనోటా ఈనోటా బయటకు వచ్చి రెవెన్యూ అధికారులకు తెలిసింది. రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని లారీని తనిఖీ చేసి రేషన్ బియ్యం అని గుర్తించారు. దీంతో తమ దందా బయటకు వస్తుందని ఆ లారీని అక్కడి నుంచి తప్పించారు. ఆ తర్వాత ఆ లారీ ఏమైందనే విషయం ఇప్పటికీ అంతు చిక్కలేదు. మరుసటి రోజు పత్రికలు, యూట్యూబ్ చానళ్లలో వార్తలు గుప్పుమనడంతో ఈ విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. దీంతో కురిచేడు వీఆర్‌ఏతో రేషన్ లారీ పట్టుకుంటే ఎత్తుకెళ్లిపోయారంటూ కురిచేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. ఆ బియ్యం లారీని తీసుకురాకుండా పది బస్తాల బియ్యాన్ని ఓ వాహనంలో తెచ్చిపడేసి అంతవరకే కేసు రాసుకోవాలని టీడీపీ నేతలు పోలీసులను ఆదేశించగా, మామూళ్లు పుచ్చుకుని తూ.చా.తప్పకుండా పాటించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

క్లుప్తంగా

మద్యం తాగి మురుగు కాలువలో పడి..

- గ్రానైట్ కార్మికుడు మృతి


కాలువలో పడి మృతిచెందిన గ్రానైట్ కార్మికుడిని పరిశీలిస్తున్న స్థానికులు

చీమకుర్తి:మద్యం సేవించి మురుగు కాలువలో పడి గ్రానైట్ కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం చీమకుర్తిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక గ్రానైట్ క్వారీలో పనిచేసే పీరు (47) అనే కార్మికుడు చీమకుర్తి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మురుగు కాలువలో పడి మృతి చెందాడు. పూటుగా మద్యం సేవించి మురుగు కాలువ కల్వర్టుపై నిద్రిస్తున్న సమయంలో అదుపుతప్పి కాలువలో పడి మృతి చెందినట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. మృతి చెందిన కార్మికుడి స్వస్థలం గాజువాకగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతిచెందిన రైతు సుబ్బారావు

చీమకుర్తి: మండలంలోని మంచికలపాడు గ్రామానికి చెందిన రైతు కోరా సుబ్బారావు (39) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. తొర్రగుడిపాడు గ్రామంలో వరినారుకి నీరు పెట్టేందుకు పొలంలోని బోరుకు స్విచ్ ఆన్ చేస్తుండగా పొలంలోని గడ్డిలో ఉన్న కరెంటు వైరు కాలికి తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ వివరించారు. భార్య సుమాంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని యువతి మృతి

మార్కాపురం: మనోవేదనతో ఉరివేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని ఎస్సీ, బీసీకాలనీలో జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గొట్టిపడియ గ్రామానికి చెందిన కొండేపోగు సువర్ణ, మరియదాసుల కుమార్తె కొండమ్మ అలియాస్ అరుణ (16) ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని చనిపోయింది. తల్లి సువర్ణ వద్ద అరుణ ఉంటుండగా తండ్రి మరియదాసు గొట్టిపడియలో నివాసం ఉంటున్నారు. తల్లి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణలపై విచారిస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


శ్రీకాంత్ మృతదేహం

మద్దిపాడు: చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మద్దిపాడు మండలంలోని దొడ్డవరప్పాడు గ్రామంలో వెలుగు చూసింది. ఆ వివరాల ప్రకారం.. దొడ్డవరప్పాడు గ్రామానికి చెందిన గడ్డం శ్రీకాంత్ (42) ఆదివారం సాయంత్రం స్థానిక సచివాలయం ఎదురుగా ఉన్న రచ్చబండపై పడుకుని ఉన్నాడు. సోమవారం ఉదయం అతని చెప్పులు చెరువు ఒడ్డున విడిచి ఉండటంతో స్థానికులు అనుమానంతో చుట్టూ వెతకగా, కొద్ది దూరంలోనే శ్రీకాంత్ మృతదేహం కనిపించింది. తహసీల్దార్, మద్దిపాడు పోలీసులకు గ్రామ వీఆర్‌ఓ సమాచారం అందించారు. మృతునికి భార్య కుమారుడు ఉన్నారు. శ్రీకాంత్ మృతి చెందడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మద్దిపాడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

మేదరమెట్ల, అద్దంకి వైపు రెండో లైన్ ద్వారా విద్యుత్

- ఒంగోలు 220 కేవీలో విద్యుత్ పనుల ఆధునికీకరణ

ఒంగోలు సబర్బన్: మేదరమెట్ల, అద్దంకి విద్యుత్ వినియోగదారులకు 22, 23 తేదీల్లో 132 కేవీ సబ్ స్టేషన్ రెండో లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఒంగోలు ఈఈ మాకినేని హరిబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఒంగోలులోని 220 కేవీ సబ్ స్టేషన్ ఉన్న 132 కేవీ మేదరమెట్ల-1 వ లైన్‌కు ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆ లైన్‌లోని సర్క్యూట్ బ్రేకర్, కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లు మారుస్తున్నామని వివరించారు. అందుకుగాను మంగళవారం ఉదయం 7 నుంచి బుధవారం రాత్రి 8 గంటల వరకు మేదరమెట్ల రెండో లైన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తారన్నారు. మేదరమెట్ల, అద్దంకి 132 కేవీ సబ్ స్టేషన్‌ల పరిధిలోని వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఇళ్ల మధ్యలో వైన్ షాపులు వద్దు

- అధికారులకు స్థానికుల వినతిపత్రాలు


ఎక్సైజ్ సూపరింటెండెంట్ కాజా మొహిద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంతనూతలపాడులోని పెద్ద బజారు వాసులు

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని పెద్ద బజారులో పిచ్చయ్య హోటల్ సమీపంలో ఇళ్ల మధ్యలో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ స్థానికులు సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కాజా మొహిద్దీన్‌కు వినతిపత్రం అందించారు. అదేవిధంగా ఒంగోలు రూరల్ సీఐ కార్యాలయంలో సబ్ ఇన్‌స్పెక్టర్ వేజండ్ల అజయ్‌బాబుకు కూడా వినతిపత్రం అందించి తమ గోడు వెళ్లబోసుకున్నారు. పిచ్చయ్య హోటల్ సమీపంలో మద్యం షాపు నంబర్ 47ను ఏర్పాటు చేసేందుకు రేకులు షెడ్డును లీజుకిచ్చారని తెలిపారు. అక్కడ గృహాలు, ఆలయాలు ఉండటంతో మహిళలు, పిల్లలు ఇబ్బందిపడే ప్రమాదం ఉందని తెలిపారు. ఆ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయకుండా చూడాలని అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేశారు.

స్టేట్ బ్యాంకు బజారులోనూ వద్దని నిరసన...

సంతనూతలపాడులోని స్టేట్ బ్యాంకు బజారులోనూ మద్యం దుకాణం వద్దంటూ ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళలు నిరసన తెలిపారు. సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతాల్లో మద్యం షాపులు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. అక్కడ ఉన్న వారంతా కూలి పనులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని జీవించే వారని తెలిపారు. ఆ ప్రాంతంలోనే అంగన్‌వాడీ కేంద్రం, ఆంజనేయస్వామి విగ్రహం, స్టేట్ బ్యాంకు ఉన్నాయని, హైస్కూల్‌కు వెళ్లే దారి కూడా కావడంతో నిత్యం బాలబాలికలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో వైన్ షాపు వద్దంటూ నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ ఆదిలక్ష్మిని కలిసి వినతిపత్రం అందించారు. పలువురు సీపీఎం నాయకులు పాల్గొని మద్దతు పలికారు.


'కొరియర్‌లో డ్రగ్స్' ఫోన్లకు భయపడొద్దు


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: మీ పేరుతో పంపించిన కొరియర్‌లో డ్రగ్స్, తుపాకులు ఉన్నాయని, ఎన్ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ నుంచి సమాచారం ఇస్తున్నామని చెబుతూ వచ్చే ఫోన్లకు భయపడి వారికి డబ్బులిచ్చి మోసపోవద్దని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి పలు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 69 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ.. బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. చట్టపరంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఫ్రాడ్ ఫోన్ కాల్ స్కామ్ మోసాలు ఎక్కువైపోయాయని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కొందరు అమాయకుల వివరాలు సేకరించి ఫోన్లు చేసి డబ్బు వసూలు చేయడం జరుగుతోందని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి ఎలాంటి ఫోన్లకు స్పందించవద్దని, ఏదైనా అనుమానాస్పద ఫోన్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దిశా ఇన్‌స్పెక్టర్ సుధాకర్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ సమీవుల్లా, ఎస్సీ ఎస్టీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై రజియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్యచేసిన భర్త అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: భార్య లక్ష్మీతిరుపతమ్మను కత్తితో హత్య చేసిన కేసులో భర్త పుట్టా వెంకట్రావును అరెస్టు చేసినట్లు సింగరాయకొండ సీఐ సీహెచ్ హజరత్తయ్య తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. సింగరాయకొండలోని కూరగాయల మార్కెట్‌లో పనిచేసే పుట్టా వెంకట్రావుకు 2019లో లక్ష్మీతిరుపతమ్మతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా వెంకట్రావు మద్యానికి బానిస కావడంతో పాటు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయమై తరచూ భార్య లక్ష్మీతిరుపతమ్మతో గొడవలు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ రాత్రి వెంకట్రావు ఉద్దేశపూర్వకంగా మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవపెట్టుకున్నాడు. ఆ సమయంలో ఇంట్లోని కత్తితో తిరుపతమ్మ ఎడమచెవి మీద, గొంతుపై గాయపరిచాడు. ఆమెకు తీవ్రంగా రక్తస్రావం అవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మరణించింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. సోమవారం ఉదయం కందుకూరు ఫ్లై ఓవర్ వద్ద ఉన్న వెంకట్రావును అరెస్టు చేశారు.

నాలుగు బృందాలతో అన్ని కోణాల్లో విచారణ

- ఆధారాలు సేకరిస్తున్న డాగ్ స్క్వాడ్ క్లూస్ టీం
- ముమ్మరంగా వృద్ధురాలి హత్య కేసు దర్యాప్తు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ భీమానాయక్, ఎస్సై సుమన్, డాగ్ స్క్వాడ్

సీఎస్ పురం (పామూరు): సీఎస్ పురం మండలం డీజీ పేట గ్రామ సమీపంలోని పొలాల్లో ఆదివారం జరిగిన వృద్ధురాలి హత్య కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. పశువుల మేత కోసం గడ్డి కోసి తెచ్చేందుకు పొలానికి వెళ్లిన డీజీ పేట గ్రామానికి చెందిన వృద్ధురాలు డేగా రత్తమ్మ (60) హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి వెలుగుచూసిన ఈ ఘటనపై వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసుకు సంబంధించి సీఐ ఎం.భీమానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గేదెలు మేపుకుంటూ జీవించే రత్తమ్మ.. ఆదివారం పశువుల మేత కోసం సమీపంలోని పొలాలకు వెళ్లింది. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో బంధువులు వెతుక్కుంటూ పొలానికి వెళ్లగా, అక్కడ తల, మొహంపై గాయాలై మృతి చెంది ఉంది. మృతురాలి బంధువు మోడి వెంకటరమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఘటన స్థలాన్ని ఒంగోలు నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో కలిసి సీఐ భీమానాయక్, ఎస్సై ఆర్.సుమన్ పరిశీలించి ఆధారాలు, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు. మృతురాలిపై గాయాలుండగా, ఆమె మెడలో ఉండాల్సిన సుమారు రూ.1.20 లక్షల విలువైన 3 సవర్ల చెయిను, చెవుల కమ్మలను దుండగులు తీసుకెళ్లారు. కమ్మలను లాగి తీసుకుపోవడంతో చెవులకు గాయమైంది. బంగారు నగల కోసమే దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని, తెలిసిన వారి పనే అయి ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. రత్తమ్మ హత్యతో మహిళలు, రైతులు ఒంటరిగా పొలం వెళ్లేందుకు భయపడుతున్నారు. విలువైన వస్తువులు లేకుండా పొలం పనులకు వెళ్లడం మంచిదని పోలీసులు సూచిస్తున్నారు. కేసును త్వరితగతిన ఛేదించేందుకు ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమానాయక్ తెలిపారు. మొత్తం 4 బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని, ప్రజలు అప్రమత్తంగా, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎవరైనా కొత్తవారు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాల్యం బంగారుమయం కావాలి

- 18 ఏళ్లలోపు పిల్లలకు సామాజిక భద్రత కల్పించాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా


సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రతిఒక్కరికీ బాల్యం బంగారుమయం కావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంపై సోమవారం ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలందరికీ విద్య, వైద్యంతో పాటు సామాజిక భద్రత కల్పనే లక్ష్యంగా యంత్రాంగం కృషి చేయాలన్నారు. జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించామని తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, నివారించాలని ఆదేశించారు. అప్పుడే డ్రాపవుట్స్‌ను తగ్గించవచ్చన్నారు. బాలకార్మిక వ్యవస్థపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వయసుకు తగినట్లు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కాలేజీల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. యంత్రాంగం చేపట్టే చర్యలకు స్వచ్ఛంద సంస్థలు కూడా అండగా నిలవాలని కోరారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ డ్రాపవుట్స్ లేకుండా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు క్రియాశీలకంగా వ్యవహరించేలా చూడాలన్నారు. బాలల అక్రమ రవాణా, బాలలతో కూలి పనులు చేయించకుండా నివారించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసేలా చూడాలన్నారు. జిల్లా స్థాయితో పాటు డివిజన్, మండల స్థాయిలో కూడా వివిధ శాఖల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయడం వల్ల బాలల హక్కులు, సమస్యలపై ఆయా స్థాయిల్లో సమావేశాలు నిర్వహించేలా నిర్దిష్ట తేదీలను ఖరారు చేయాలని సూచించారు. కలెక్టర్ స్పందిస్తూ బాలల సమ్మిళిత అభివృద్ధే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సూచనలను పరిగణలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ మాధురి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రీదేవి, డీఎంహెచ్‌ఓ సురేష్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, బీసీ సంక్షేమ అధికారి అంజల, జిల్లా ప్రొబేషనరీ అధికారి బాలప్రభాకర్, మహిళా పోలీసు స్టేషన్ అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి : కలెక్టర్

జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం ఒంగోలులోని ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. తాగునీటి క్లోరినేషన్, నాణ్యత పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా నీళ్ల ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. టైఫాయిడ్, మలేరియా వంటి జ్వరాలు రాకుండా దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దోమల లార్వాను నిర్మూలించేందుకు ఆయిల్ బాల్స్ వినియోగించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. దోమకాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ సురేష్‌కుమార్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకటనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.